"లెట్ హర్ గో టు హెల్లా? రాస్కెల్ ! మళ్ళీ అను"

డార్క్‌డెవిల్ నీరసపడి పోయాడు.

"షారీ బ్రదర్! అయామ్ రియల్లీ షారీ.......! ఈ ఒక్కసారికి డార్క్‌ని సంతోషపెట్టు . కన్నీరు రానీకు. నెవర్ " అతని కోపం అంతా కరిగిపోయింది. డార్క్ డెవిల్ కౌగలించుకున్నాడు.

"ఒరేయ్ ......ఇదిగో ......ఇంకొంచెం మిగిలింది షిషాలో ఇద్దరికీ చెరోసగం. స్ట్రిక్ట్‌లీ ఫిఫ్టీ ....ఫిఫ్టీ ...డోంట్ రెవ్యూజ్ ........ఇది మాత్రం డార్క్‌డెవిల్ హెల్త్ కోసం."

ఇద్దరి గ్లాసులూ పూర్తిగా నింపాడతను.

ఛీర్స్ అంటూ గ్లాసులు కలపడానికి రెండు నిమిషాలు తంటాలు పడ్డారు. ఆఖరికి 'టంగ్ ' మని కలుసుకున్నాయ్.

* * * *

చీకటి........

ఏమీ కనిపించడం లేదు. దానికి తోడు నిశ్శబ్దం. కళ్ళు నులుముకుని చూశాడు. మసక మసకగా వుంది.

సన్నగా, నెమ్మదిగా, రహస్యంగా వినబడసాగింది.

చెవులు రిక్కించి విన్నాడు.

టక్ -టక్ , టక్ -టక్ , టక్-టక్ , టక్-టక్ , టక్-టక్.

ఏమిటది? గడియారమా ? అవును అలారం టైమ్‌పీస్! ఎక్కడుందది ? మరోసారి చుట్టూ చూశాడు.

అలారం గడియారం! రేడియం ముళ్ళు మెరుస్తున్నాయ్. అవును! అదెక్కడినుంచి వచ్చింది? తన ఇంట్లో లేదు కదా?

అసలిది రాత్రా? పగలా? మరోసారి రేడియం ముళ్ళ వైపు చూశాడు. చుక్కలు కనబడుతున్నాయ్. అప్పుడు వినిపించింది-

పక్కనే ఉచ్ఛ్వాస నిశ్వాసాల శబ్దం బరువుగా, సన్నగా...

సురేష్ పక్కకు తిరిగి పడుకున్నాడు. చేత్తో తడిమాడు. మెత్తగా, సన్నగా ఆమె ఊపిరి వెచ్చగా తగులుతోంది.

అతను మరింత దగ్గరగా జరిగాడు.

ఆమె పాదాల మీద ముద్దు పెట్టుకున్నాడు. కొత్తగా, వింతగా, నరాలు జివ్వున లాగేస్తూ, చేతులు అలవాటు రీసెర్చి ప్రారంభించినాయి.

ఆమె స్పర్శ నిలువునా నిప్పులా అంటుకుంటోంది.

ఆమె నడుము తన మీదకు లాగబోతూంటే గుండె ఝల్లుమంది. ఆ స్పర్శ, ఆ వెచ్చదనం కొత్తగా, వింతగా అనిపిస్తున్నాయ్.

కాళ్ళు పాదాలను తాకినయ్.

అనుమానం బలపడిపోతోంది!

ఆమె చలనం ప్రారంభమయింది. చేతులు గుండె దగ్గర ఆగిపోయినయ్. ఇంకొద్ది క్షణాల్లో స్వర్గ ద్వారాలు తెరచుకుంటాయ్. వేడి నిట్టూర్పులు, సెగలు.

సురేష్‌కి మతిపోయింది.

"తులసీ ...."

ఆమె నెమ్మదిగా నవ్వింది.

"తులసే కావాలా?"

అదిరిపడ్డాడు. "నువ్వు... మీరు...."

"ఇప్పుడు స్పృహ వచ్చిందా?" ఇంకా నవ్వుతూనే అంది.

బాంబులు ఒకదాని తర్వాత ఒకటి పేలుతున్నట్లుంది.

కొంప మునిగింది. తన పక్కన ఉన్నది తులసి కాదు. అయితే మరెవరు? అసలు తనెక్కడున్నాడు? ఎందుకున్నాడు? ఇది పగలా?రాత్రా? టైమెంత?

లేచి కూర్చోబోయాడు. ఆమె నడుముకి బంధం వేసింది.

"ఎక్కడికి?"

"లైటు వేస్తాను"

"నాకేం తెలీడంలేదు"

"ఏం తెలుసుకోవాలి?"

"నువ్వు...సారీ....మీరు....."

"ఇప్పుడు అవసరమా అది?"

"అవును"

ఆమెను వదిలించుకుని మంచం దిగి గోడ తడమసాగాడు స్విచ్ కోసం. ఆమె నవ్వుతోంది బిగ్గరగా. ఎక్కడో విన్నాడు ఆ గొంతు.... తులసిది మాత్రం కాదు!

"స్విచ్ ఎక్కడుందో తెలీదా"

"తెలుసు. కొన్ని రోజులు స్విచ్ ఆపరేటర్ రూమ్ మేట్‌గా వున్నాను" వెతుకుతూనే అన్నాడు.

చివరకు నేలకు అడుగు ఎత్తులో దొరికింది. ట్యూబ్‌లైట్ మెరుపు కాంతిలో వెలిగింది.

డబల్‌బెడ్ మధ్యలో ముఖం మీద చేతులు కప్పుకుని, బోర్ల పడుకుని-

గదంతా చూశాడు. మైగాడ్! తను హోటల్ రూమ్‌లో వున్నాడు నటాషా రూమ్.

రూమ్ నెంబర్ 696. అంటే మంచం మీద నటాషానా? ఆమె దగ్గరకు నడిచాడు.

"నటాషా" ఆమె తృళ్ళి తృళ్ళి నవ్వుతోంది బోర్లా పడుకుని.

బలవంతంగా వెల్లకిలా తిప్పాడు.

ఇంకో షాక్....

రాజ్యలక్ష్మి- నటాషా కాదు.

ఏం జరిగిందసలు? తనిక్కడ నటాషా రూమ్‌లో రాజ్యలక్ష్మితో-సంథింగ్ రాంగ్ సమ్ వేర్.

"ఇప్పుడు తెలుసుకున్నారా?" చీర చుట్టుకుంటూ అంది.

సురేష్ ఆతృతగా ఆమెకు సమీపంగా వెళ్ళాడు. "మన మధ్య ఏమైనా జరిగిందా?"

ఆమె చిలిపిగా చూసింది. "మొద్దు స్వరూపం...."

"ప్లీజ్ చెప్పండి"

"ఎందుకు జరగదు? ఇది ఫస్ట్ టైమ్ నాకు...ఇలాంటి ఎక్స్‌పీరియన్స్! నాకో జోక్ గుర్తుకొస్తోంది."

సురేష్ నీరసపడిపోయాడు. కానీ ఇదంతా కావాలని చేసింది కాదు. తన తప్పేమీ లేదు.

తులసి దగ్గర గిల్టీగా తలవంచుకోనవసరంలేదు.

"ఏం జోక్ అది?" వుత్సాహంగా అడిగాడు.

"మా చిన్నప్పుడు మాకు ట్యూషన్ చెప్పటానికో పంతులు వస్తూండేవాడు. ఆయనకు సంగీతం అంటే చచ్చేంత యిష్టం. మా పిన్ని అప్పుడు మాంఛి యవ్వనంలో వుండేది. అద్భుతమైన గొంతు. ఆమె శ్రావ్యంగా పాటలు పాడేది. ఓ రోజు నేను ఆటలాడుకుని ట్యూషన్ టైంకింటికి చేరుకునేసరికి మా బాత్‌రూమ్ తలుపు కీ హోల్ దగ్గర మాష్టారు చెవిపెట్టి వింటున్నారు. లోపల మా పిన్ని స్నానం చేస్తూ పాడుతూంటే" విరగబడి నవ్వసాగిందామె.

"ఇడియట్" అన్నాడు సురేష్ పళ్ళు కొరుకుతూ "దృశ్య కావ్యానికీ, శ్రవ్య కావ్యానికి తేడా తెలుసుకోలేని వాజమ్మ..."

ఆమె జుట్టు సరిచేసుకుంటుంటే ఎదురుగ్గా నిలబడ్డాడు సురేష్ .

"అసలు ఎలా జరిగిందిది? నవ్వకండి. నాకేమీ తెలీడంలేదు. నేనిక్కడ కెప్పుడొచ్చాను? నటాషా ఏది....? మనం ఇందులోకి ఎలాదిగాము?"

"మధ్యాహ్నం రెండు గంటల కొచ్చారు. తలుపు తెరిచాను. లోపలి కొచ్చి మంచం మీద కూర్చున్నారు. బాగా 'ఆన్'లో వున్నారని తెలిసిపోయింది నాకు.

పడుకుంటారా అనడిగాను.

అవునన్నారు. అని మంచాని కడ్డంగా పడిపోతే సరిగ్గా లాగి పడుకోబెట్టబోయాను.

నన్నూ మీతోపాటు లాక్కున్నారు. అంతే....! ఎనిమిది గంటలు గడిచిపోయింది."

"అంటే ఇప్పుడు రాత్రి...."

"పదకొండు అవుతోంది"

సురేష్‌కి కొంచెం కొంచెంగా గుర్తుకొస్తోంది. తను డార్క్ డెవిల్ రూమ్ కెళ్ళడం, అతను తనను బలవంతంగా ఫుల్‌గా తాగించడం, అక్కడ్నించి తను బస్‌లో ఆబిడ్స్ చేరుకోవడం, నటాషా కోసం తలుపు తట్టడం- అంతే... అంతవరకే! ఆ తరువాత తనను విస్కీ లొంగదీసేసుకుంది. దాని ప్రభావంలో తనేం చేశాడో తనకే తెలీదు.

"నటాషా ఏదీ?"

"ఇవాళ స్పెషల్ స్ట్రిప్ టీజ్ షోస్ వున్నాయ్. లక్కీ గాళ్! ఒక్కరోజులో రెండువేలు సంపాదిస్తుందీవాళ...."

"మీతో ఇలా ప్రవర్తించినందుకుగాను చాలా సిగ్గుగా వుంది."

"నాకు చాలా హేపీగా వుంది..."

అతను తెల్లబోయాడు.

"అబద్ధం చెబుతున్నారు కదూ?"

"అలా అనుకునేట్లయితే మళ్ళీ ప్రయత్నించి చూడండి" వళ్లంతా కొంటెతనం.

"ఇదంతా తాగిన మైకంలో జరిగిపోయింది."

"అయితే మీకు రోజూ నేను తాగిస్తాను...."

సురేష్ మంచంమీద కూలబడిపోయాడు. ఈ పాటికి తులసి చదువుకోవటం ఆపి పడుకుని వుంటుంది. తన బదులు తలగడను ఉపయోగించుకుని కాసేపు తంటాలుపడి... తనమీద కోపం తెచ్చుకుని .... మళ్ళీలేచి గదంతా పచార్లు చేస్తూ యింటికి రాగానే తననెలా ఎటాక్ చేయాలా అని రిహార్సల్స్ వేసుకుంటూ......